క్లుప్తంగా

రేపు పోస్టాఫీసులో సేవలకు విరామం

చల్లపల్లి: సాఫ్ట్‌వేర్‌ను అప్డేట్ చేస్తున్న కారణంగా స్థానిక పోస్టాఫీసులో ఈనెల 21వ తేదీన వినియోగదారులకు ఎటువంటి సేవలు అందుబాటులో ఉండవని హెడ్ పోస్ట్‌మాస్టర్ వి.నాంచారయ్య శనివారం తెలిపారు. తిరిగి మంగళవారం నుంచి యథావిధిగా సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వినియోగదారులు గ్రహించి సహకరించాలని నాంచారయ్య కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



కృత్తివెన్ను: మండల పరిధిలోని చెరుకుమిల్లి గ్రామంలో శ్రీ అన్నపూర్ణాదేవీ సమేత ఓంకారేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరిగి మండల కాలం పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ ఏర్పాట్లు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం ఆషాఢ ఆడికృత్తిక సందర్భంగా శ్రీ వల్లీదేవసేన అమ్మవార్లను వివిధ రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరి అలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పండ్లు కూరగాయలతో ఆలయ ప్రాంగణాన్ని ఆలయ సిబ్బంది, భక్తులు అలంకరించే పనిలో నిమగ్నమయ్యారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గూడూరు: గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని కప్పలదొడ్డి వాసులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నాకులమన్నాడు, పెదన గానీ వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

క్రీడా సామగ్రి అందజేత



అవనిగడ్డ: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌కు అవనిగడ్డకు చెందిన చింతా సీతారామయ్య, రాధిక రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ స్కూల్‌కు చెందిన విద్యార్థులు క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. మరింత మెరుగ్గా రాణించాలనే ఉద్దేశంతో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు కోసూరు పూర్ణచంద్రరావు ప్రోద్బలంతో దాతలు ఈ సహాయం అందించారు. క్రీడా వస్తువులను స్థానిక సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ చేతుల మీదుగా ఇన్‌చార్జి హెచ్ఎం నాగమల్లేశ్వరరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మునగాల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం







ఇటీవల పామర్రులో ప్రయాణికులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి పక్కనున్న కాలువలోకి దూసుకుపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. పులిగడ్డ- పెనుమూడి వారధిపై టోల్‌గేట్ వద్ద కొన్ని రోజుల కిందట రెండు ఆటోలు ఢీకొని ఏడుగురు గాయాలపాలయ్యారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో కుక్కేస్తున్నారు. దివిసీమ ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభం కావటంతో బాపట్ల జిల్లా రేపల్లె చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆటోలలో కూలీలు పొలం పనుల కోసం ఇక్కడికి వస్తున్నారు. సుమారు 100 నుంచి 120 ఆటోలు కూలీలను ఎక్కించుకుని వస్తున్నాయి. ఒక్కొక్క ఆటోలో 16 నుంచి 24 మందికిపైగా ఎక్కుతున్నారు. కనీసం ఆటో నడపడానికి కూడా అవకాశం లేకుండా డ్రైవర్‌కు రెండు పక్కలా ఇరుక్కుని మరీ కూర్చోవటం ప్రమాదాలకు కారణమవుతోంది. దీనికి మితిమీరిన వేగం తోడవుతోంది. ఓవర్‌లోడు, వేగ నియంత్రణపై పోలీసుల పర్యవేక్షణలేకపోవటం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– చల్లపల్లి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు



అవనిగడ్డలో ర్యాలీ



పెడన ర్యాలీలో కమిషనర్ చంద్రశేఖరరెడ్డి తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతి ఉద్యోగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కార్మికులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బి.శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో ఏఎస్ఎన్ రాధిక, పలువురు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందిచే శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణాలను పరిశుభ్రం చేయించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అచ్యుత మధుసూదనరావు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలనపై ర్యాలీలు నిర్వహించారు. మండల పరిధిలోని పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడమని సర్పంచ్ విజయ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి అనిత, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు దుడ్డు కృష్ణారావు, సురేష్, నాగరాజు, దిలీప్, సాయి పాల్గొన్నారు.

అవనిగడ్డ: ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలన చేయాలంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వస్తువులు వాడమని విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ దొరబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి వాటిని వాడకుండా చూడాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అధ్యాపకులు దుడ్డు కృష్ణారావు, సురేష్, నాగరాజు, దిలీప్, సాయి పాల్గొన్నారు.

సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్‌ను నిలువరిద్దాం

పెడన: అందరం కలిసి కట్టుగా సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలువరిద్దామని మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో భట్ట జ్ఞాన కోటయ్య హై స్కూల్‌లో విద్యార్థులకు, రైతు బజారులో వ్యాపారస్థులకు, ప్రధాన రహదారిపై వ్యాపారస్థులకు అవగాహన కలిస్తూ ర్యాలీలు నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. మున్సిపల్ ఆఫీస్ నుంచి బంటుమిల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ రాజా, వార్డు ఎన్విరాన్మెంట్ అండ్ శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా విభాగం సిబ్బంది,వార్డు మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులుపాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం రావాలి

బంటుమిల్లి: ప్లాస్టిక్ రహిత సమాజం రావాలని ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా అధ్యాపకులు విద్యార్థులు ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే ప్రమాదాలపై ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. కాలేజీ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి అధ్యాపకులు, విద్యార్థులు ప్లాస్టిక్ రహిత గ్రామంగా బంటుమిల్లి తయారు చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత బ్యాగులను అందజేశారు. ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీల ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జీబీ ఆనందకుమార్, ఆర్. హిమాలినీదేవీ, వైస్ ప్రిన్సిపాల్ డి.దేవ జయరాజు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులకు చట్టాలు వర్తించవా?

పోలీసులకు వైఎస్సార్ సీపీ నగర నాయకుల సూటి ప్రశ్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మచిలీపట్నంటౌన్: టీడీపీ శ్రేణులకు భారత చట్టాలు వర్తించవా అని వైఎస్సార్ సీపీ నగర నాయకులు ప్రశ్నించారు. స్థానిక రామానాయుడుపేటలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న మాట్లాడుతూ ఈనెల 16న మాజీ మంత్రి పేర్ని నాని నివాసానికి సమీపంలో టీడీపీ మహిళలు ఆయన చిత్రాలను చీపుర్లు, చెప్పులతో కొట్టి నిరసన తెలిపారన్నారు. దీనికి ప్రతిగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు 17న జవ్వారుపేట సెంటర్లో జెడ్పీ చైర్పర్సన్ ఉప్పల హారిక ఘటనకు నిరసనగా కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంతో ఎలాంటి సంబంధం లేని తమపై అక్రమ కేసులు బనాయించి పోలీస్ స్టేషన్‌లో ఉంచి నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. 17వ తేదీ సాయంత్రం టీడీపీ నాయకులు రామానాయుడుపేట సెంటర్లో పేర్ని నాని దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారన్నారు. వీటిపై తాము ఫిర్యాదు చేసినా పోలీసులు ఇప్పటి వరకు కేసులు నమోదు చేయకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. భారత చట్టాలు టీడీపీ శ్రేణులకు వర్తించవా అని ప్రశ్నించారు. ఈ ఘటనలపై తాము కోర్టులో ప్రైవేట్ కేసులు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కృష్ణా జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కొలుసు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వే కార్యదర్శులకు వీడ్కోలు

పెడన: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర మండలాలకు రిలీవ్ అయి వెళ్లిన వారికి శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జ్ఞాపికలను అందించి సత్కరించి వీడ్కోలు చెప్పారు. ఇన్‌చార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్, మండల సర్వేయర్ ప్రభుదాస్, సర్వే డీటీ సల్మా తదితరులున్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు



రాంప్రసాదం

కోడూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన చందన రాంప్రసాదం (90) కనిపించడం లేదని ఆమె మనుమడు మనోజ్ శనివారం కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి నుంచి రాంప్రసాదం కనిపించడం లేదని, శనివారం గ్రామంలోని బంధువుల ఇళ్లతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లో కూడా వెతికినట్లు మనోజ్ పేర్కొన్నాడు. రాంప్రసాదం ఆచూకీ కనిపించకపోవంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్ తెలిపారు. వృద్ధురాలి జాడ తెలిసినవారు 94408 58996కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

కిడ్నీ మార్పిడి చేసిన లాస్య మృతి



గాజుల లాస్య (ఫైల్)

అవనిగడ్డ: దాతల విరాళంతో మూడేళ్ల క్రితం కిడ్నీ మార్పిడి చేయించుకున్న గాజుల లాస్య (21) శనివారం కన్నుమూసింది. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలతో డిగ్రీ చదువుతుండగా ఆమెకి కిడ్నీ సంబంధిత వ్యాధి బయట పడింది. మూడేళ్ల క్రితం ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల విద్యార్థులు, పలు స్కూల్స్, కళాశాలలకు చెందిన విద్యార్థులు, పలు ప్రాంతాలకు చెందిన దాతలు స్పందించి విరాళాలు అందించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారానూ విరాళం అందించారు. దీంతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్నారు. కొంతకాలం ఆరోగ్యంగానే ఉన్న లాస్యకు కొద్ది నెలలుగా మళ్లీ ఆరోగ్యం క్షీణించింది. కిడ్నీ మార్పిడి చేయించుకున్న దగ్గర నుంచి లాస్య తల్లిదండ్రులతో కలిసి విజయవాడలో ఉంటున్నారు. శనివారం విజయవాడలో ఆమె మరణించగా, స్వగ్రామమైన వేకనూరు శివారు గాజులవారిపాలెంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. లాస్య తండ్రి సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గాజుల మురళీకృష్ణ (భట్టో) నియోజకవర్గంలో సుపరిచితుడే. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు, పలువురు లాస్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జీవితకాలాన్ని పెంచేందుకు మొక్కలు దోహదం



కోనేరుసెంటర్: మొక్కలను పెంచుతూ వాటికి దగ్గరగా గడుపుతూ మంచి గాలి పీల్చుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఒక్కో విద్యార్థి ఐదు మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దాతల సహకారంతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పది వేల మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రామశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ గోపి, ఇంజినీర్ బసవేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి



పెడన: స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవి శనివారం భక్తులకు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చింది. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, ఆకు కూరలతో సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో వివిధ ఆర్యవైశ్య సంఘాలు, వాసవి మహిళా మండలి సభ్యులు శాకంబరి అలంకరణ చేశారు. ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని ఆర్యవైశ్యులకు అమ్మవారి అన్న ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బుద్ధప్రసాద్ చెప్పేవన్నీ అబద్ధాలే!

వైఎస్సార్ సీపీ నాయకులు



నెలరోజులకే పడిపోయిన తడికెల ఫొటోలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు

అవనిగడ్డ: నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా, చేయని పనులను చేసినట్టుగా అబద్ధాలు చెప్పడం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కే చెల్లిందని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. చెత్త, మురుగు వల్ల ఇబ్బంది పడుతున్న అవనిగడ్డ డంపింగ్‌యార్డుని వారు శనివారం పరిశీలించారు. పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ మాట్లాడుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మూడు చోట్ల స్థలాలు చూపిస్తే బుద్ధప్రసాద్ అనుచరులే అడ్డుకున్నారని చెప్పారు. బుద్ధప్రసాద్ హయాంలో వేసిన కోడూరు రోడ్డు ఎనిమిదేళ్లు ఉండాల్సి ఉండగా ఎనిమిది రోజులకే పోయిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఈ రోడ్డు నిర్మాణానికి రూ.16.80 కోట్లు మంజూరు చేయించి పనులు చేయించారని చెప్పారు. ఎన్నికల వల్ల పనులు సగంలోనే ఆగిపోగా, తరువాత ఎమ్మెల్యే అయిన బుద్ధప్రసాద్ తిరిగి పనులు ప్రారంభించడానికి పది నెలలు పట్టడంలోని అంతర్యాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రిపై అవాకులు చవాకులు పేలడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మా నాయకుడు సింహాద్రి పోరాడి చుక్కల భూములకు విముక్తి కలిగిస్తే మీ ప్రభుత్వం మళ్లీ చుక్క పెట్టి రైతులకు నరకం చూపిస్తోందని, ఇవేమీ ఎమ్మెల్యేకి కనబడవా అని రమేష్ ప్రశ్నించారు.

పార్టీ పంచాయితీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడాదిలో రూ.825 కోట్లు అభివృద్ధి చేశామని బుద్ధప్రసాద్ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మోపిదేవి మండలంలో చిర్లపాలెం వాగు దగ్గర రూ.30 లక్షలతో తడికలను అడ్డుపెట్టి చేసిన పనులు నెలరోజులకే పడిపోవడం మీరు చేసిన అభివృద్ధా అని ప్రశ్నించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో డంపింగ్‌యార్డు గురించి ఆందోళనలు, ప్రెస్‌మీట్లు పెట్టిన నాయకులు ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా డంపింగ్ యార్డు గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఈ సందర్భంగా డంపింగ్‌యార్డుని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం డ్రెయిన్ పనులు చేసిన నెలరోజులకే పడిపోయిన తడికెల ఫొటోలను నాయకులు ప్రదర్శించారు. పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గాజుల జయగోపాల్, మద్ది వెంకట నారాయణ, సామర్ల రాముడు, గార్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 22వ డివిజన్ మల్కాపట్నం దేవునితోట యానాదుల కాలనీలో నవజీవన్ బాల భవన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు సుధీర్, పుష్పాంజలి దాదాపు 100 మంది యానాదులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారవద్దని హెచ్చరించారు. మత్తుపదార్థాలకు అలవాటును దూరం చేసేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ కుంభా రవికిరణ్, ఆ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ వసంతకుమారి, నర్సులు సునీత, సంధ్య ఉపాధ్యాయులు ఆశాజ్యోతి, లలిత, రాజ్యలక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక



చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆవరణలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చల్లపల్లి: స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్కె నగర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో 30 మందిని పరీక్షించి ఎనిమిది మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. వైద్యులు వెంకటరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపిక చేసినవారికి గూడురులోని సాయినేత్ర వైద్యాలయంలో కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కంఠమనేని సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా వారి కుమార్తె దీప్తిశ్రీ, కుమారుడు దిలీప్, మనుమడు శ్రీరాఘవ్‌ల ఆర్థిక సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నర్రా సాయిబాబు, చల్లపల్లి శాఖ ప్రెసిడెంట్ ముమ్మనేని నాని, లయన్స్ కంఠమనేని సుధాకర్, మోపిదేవి వెంకటేశ్వరరావు, వరదా హరిగోపాల్, ఏఎల్‌ఆర్‌కే ప్రసాద్, కస్తూరి ప్రసాద్, ఎం.వి.కృష్ణారావు, పరిశే జలందర్, అర్జా శ్రీనివాసరావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధం

జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ




మచిలీపట్నంటౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో హాస్య నాటికలు మరిన్ని రావాలని ప్రపంచ రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావ తరంగిణి ఆధ్వర్యాన స్థానిక మహతి కళావేదికపై శనివారం రాత్రి హాస్య లఘు నాటికల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ హాస్య నాటికలు మానసిక ఆనందాన్ని ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధమని ప్రతి ఒక్కరూ జీవితంలో హాస్యాన్ని ఆస్వాదించాలని అన్నారు. ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మాట్లాడుతూ మన సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని గతంలో వచ్చిన హాస్య నవలలు, నాటికలు నాటి నుంచి నేటి వరకు నిలిచి ఉండటమే అందుకు నిదర్శనం అన్నారు. న్యాయవాది, సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మునిమాణిక్యం నరసింహారావు, ముళ్ళపూడి వెంకటరమణ, జంధ్యాల వంటి ఎందరో మహనీయులు రాసిన హాస్య రచనలు మన మదిలో నిలిచే ఉన్నాయన్నారు. శ్రీ సరస్వతీ కళా సమితి అధ్యక్షుడు సి.శేషాచార్యులు, సిరి కవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ మాట్లాడారు. సభానంతరం ప్రదర్శించిన హాస్య నాటిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. భవిష్య రచన దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటికలలో దండిబొట్ల దత్తాత్రేయశర్మ, ఆర్. సత్యనారాయణ, ఏఎస్ ఎం.ప్రసాద్, రావినూతల వెంకటేశ్వరరావు, వై.శ్రీ రామ్, పి.శాంతి అద్భుతంగా అభినయించి అందరినీ కడుపుబ్బ నవ్వించారు. మహమ్మద్ బేగ్ పెళ్లికూతురుగా స్త్రీ వేషంలో ఆకర్షణగా నిలిచారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్ రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలోని కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ను శనివారం ప్రారంభించారు. ఆ డివిజన్ ఇన్‌చార్జ్ కొడాలి అంజయ్య టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను సుమారు రూ.4.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల ఈ ప్రాంత కాలనీవాసులకు లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. తమ ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి కృషిచేసిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కోతులు



ఘంటసాల: ఘంటసాల గ్రామంలో కోతుల బెడద ఎక్కువైంది. ఇళ్లల్లోకి వెళ్లి ఆహార పదార్థాలు, కూరగాయలను పట్టుకుపోయి నాశనం చేస్తున్నాయి. వీధులు, రహదారులపై గుంపులు గుంపులుగా చేరి దాడులు కూడా చేస్తున్నాయి. దీంతో ఒంటరిగా ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.